సార్వత్రిక సమ్మెకు మున్సిపల్ కార్మికుల మద్దతు

- లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్
- రోజుకు 10 గంటల పని విధానానికి వ్యతిరేకం
- ఆప్కాస్ రద్దుతో మళ్లీ ఏజెన్సీల దందా


ఆర్ఆర్‌పేట ఓఎస్ఆర్ వద్ద గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న కార్మికులు (ఫైల్)


కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నాయకులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు, రోజుకు 10 గంటల పని విధానం రద్దు చేయాలని, ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ జూలై 9వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు కూడా పాల్గొంటున్నారు. ఈమేరకు ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భాను ప్రతాప్‌కు యూనియన్‌ల నాయకులు సమ్మె నోటీసును ఇప్పటికే అందజేశారు. మున్సిపల్ కార్మికులకు 12వ పీఆర్సీ ప్రకటించాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, రోజుకు 10 గంటల పని పెంపును ఉపసంహరించుకోవాలని తదితర డిమాండ్లపై దేశవ్యాప్తంగా సమ్మె చేయనున్నారు. ఈ సమ్మెలో ఏలూరు నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల ఉద్యోగులు, కార్మికులు దాదాపు 1000 మంది పాల్గొననున్నారు.

ఆప్కాస్ రద్దు యోచన వద్దు

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ కార్పొరేషన్ (ఆప్కాస్)రద్దు చేయాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే ఏలూరు నగరపాలక సంస్థ కార్మికులు ఇప్పటికే పలు దఫాలుగా నిరసనలు, ధర్నాలు చేశారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే తమకు నెల నెలా ఒకటో తారీఖున అందే వేతనాలు అందవని, ప్రతి నెలా క్రమం తప్పకుండా జమయ్యే పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల వాటా సొమ్ము జమకాదని ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేసి తమకు అనుకూలురైన కాంట్రాక్టర్లకు ఏజెన్సీ పేరుతో అప్పగిస్తే తమపై వారి పెత్తనం పెరుగుతుందని, తద్వారా వేధింపులు, వేతనాల్లో కోతలు వంటివి షరా మామూలవుతాయని ఉద్యోగులు చెబుతున్నారు.

2019లో ఆప్కాస్ ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ (ఆప్కాస్) పేరుతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తద్వారా ఏలూరు కార్పొరేషన్‌లోని 800 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి లబ్ధి చేకూరింది. ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు ఇస్తున్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సకాలంలో జమ చేస్తున్నారు. కనీస వేతనం అమలు చేస్తున్నారు. ఆప్కాస్ లేని సమయంలో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా కారణంగా ఇబ్బందులు పడ్డామని సిబ్బంది గుర్తుచేసుకుంటున్నారు. ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేసి తమను ఇబ్బందుల పాలు చేయవద్దని వారు కోరుతున్నారు.

ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులకు ద్రోహమే



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేయాలని చూస్తే అది కార్మికులకు తీరని ద్రోహం చేయడమే. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం అంటే ఉద్యోగులకు భద్రత లేకుండా పోతుంది. జీత భత్యాలలో కోత, పీఎఫ్, ఈఎస్ఐ నిధులు స్వాహా జరిగే ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వ చర్యను ప్రతి ఒక్కకార్మికుడు వ్యతిరేకించాలి.

– బి.సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు, సీఐటీయూ, ఏలూరు

ఆప్కాస్‌ను కొనసాగించాలి



కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఒకే చత్రం కిందకు తీసుకొచ్చేందుకు ఆప్కాస్ దోహద పడింది. కార్మికులకు కొద్దో గొప్పో ఉపయోగకరంగా ఉన్న ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలనుకోవడం పాలకుల నిరంకుశత్వానికి అద్దం పడుతుంది. తమ సొంత మనుషులకు లబ్ధి చేకూర్చే ప్రయత్నమే ఇది తప్ప మరొకటి కాదు.

– అంగులూరి జాన్ బాబు, కార్మికుడు, పారిశుద్ధ్య విభాగం, ఏలూరు కార్పొరేషన్

సమ్మెకు సంపూర్ణ మద్దతు



ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెకు ఇఫ్టూ అనుబంధ అన్ని కార్మిక సంఘాలు మద్దతు ఇస్తున్నాయి. ఈ సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనేందుకు రంగం సిద్ధం చేస్తున్నాయి. కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నదే ప్రధాన డిమాండ్. ఈ సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి.

– బద్దా వెంకట్రావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఇఫ్టూ, ఏలూరు

10 గంటల పని విధానం వద్దు



ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 8 గంటల పని విధానం స్థానంలో ప్రభుత్వం 10 గంటల పని విధానాన్ని ప్రవేశ పెట్టాలనుకోవడం దుర్మార్గం.ఈ నెల 9న జరిగే సమ్మెను విజయవంతం చేయాలి. కార్మికుల సత్తాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చూపాలి. ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాలలోని కార్మికులంతా సమ్మెలో పాల్గొనాలి.

– పి.కిషోర్, ఏఐటీయూసీ నాయకుడు, ఏలూరు

క్లుప్తంగా

పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలి


పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి ఆమ్రపాలి

ఏలూరు(మెట్రో) / ఏలూరు (టూటౌన్): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రత్యేక అధికారి, టూరిజం డైరెక్టర్ కె.ఆమ్రపాలి సూచించారు. మంగళవారం ఆమె ఏలూరు నగరంలోని పత్తేబాద, ఎస్సీ నివాసిత ప్రాంతంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏటా సుమారు రూ.33,600 కోట్లు సామాజిక పెన్షన్ల కోసం ప్రభుత్వం ఖర్చుచేస్తుందన్నారు. ఆమె వెంట డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, నగర మున్సిపల్ కమిషనర్ ఎ. భానుప్రతాప్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లలో టెలిఫోన్ బిల్లులకు పరిష్కారం

ఏలూరు (టూటౌన్): బీఎస్ఎన్ఎల్ టెలిఫోను బిల్లుల బకాయిలను వినియోగదారులు ఈ నెల 5న నిర్వహించే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని టెలికాం జీఎం ఎల్ శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, తణుకు, భీమవరం, నరసాపురం పరిధిలోని శనివారం ఉదయం 10 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు 94947 08898, 94903 12777, 94404 33533లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కార్పొరేటర్ నిర్మలను పరామర్శించిన జేపీ


కార్పొరేటర్ మదిరి నిర్మల, జేవియర్‌ను పరామర్శించిన జేపీ, నాయకులు

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ స్థానిక 24వ డివిజన్ కార్పొరేటర్ మదిరి నిర్మల, పార్టీ సీనియర్ నాయకుడు జేవియర్‌ను ఆపార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) పరామర్శించారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకున్న వారిని తమ నివాసంలో మంగళవారం జేపీ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్ గురునాథ్, బీసీ సెల్ నగర అధ్యక్షులు కిలాడి దుర్గారావు, సీనియర్ నాయకులు దాసరి రమేష్, జక్కుల బెనర్జీ, ఆర్‌టీఐ విభాగం జిల్లా అధ్యక్షులు స్టాలిన్, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ల బాచి, సత్యనారాయణ ఉన్నారు.

పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించం


పారిశుద్ధ్య పనులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

దెందులూరు: పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఏలూరు రూరల్ ఎంపీడీఓ శ్రీలత హెచ్చరించారు. మంగళవారం పాలగూడెంలో పారిశుద్ధ్య పనులను ఆమె తనిఖీ చేశారు. వర్షపు నీరు దిగువకు వెళ్లేలా ఆయా వీధుల్లో తాత్కాలిక డ్రెయిన్లు తవ్వించారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి సరఫరాలో లీకేజీ లేకుండా పర్యవేక్షణ చేయాలన్నారు.

మాజీ కౌన్సిలర్ సత్యనారాయణకు నివాళి


సత్యనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జేపీ

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికి చెందిన రాజకీయ నేత, మాజీ కౌన్సిలర్ బోధ సత్యనారాయణ మృతిచెందారు. ఆయన మృతదేహం వద్ద వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నాయకులు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, కిలాడి దుర్గారావు, సత్యనారాయణ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ఉంగుటూరు: పంచాయతీ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలకు కూడా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు వెంటనే ఇవ్వాలని కోరారు. 16వ ఫైనాన్స్ కమిషన్ విడుదల చేసిన 1150 కోట్లు స్థానిక సంస్థలకు అందజేయాలన్నారు. పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ పథకం అవినీతిమయం అయిందని విమర్శించారు. తల్లికి వందనం పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుండటాన్ని నిరసిస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమం విజయవంతమైందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

వీడని వాన

వారం రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రజలు రోడ్డెక్కితే ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. చిరుజల్లులతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఏలూరు నగరంలో మంగళవారం వర్షంలోనే రాకపోకలు సాగిస్తున్న దృశ్యాలివీ.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు


ఏలూరు నగర ప్రధాన రహదారిపై వర్షంలోనే రాకపోకలు సాగిస్తున్న వాహనాలు


వర్షంలో గొడుగే రక్షణ


రెయిన్ కోటు వేసుకుని వెళుతూ..


వర్షంలో తడుస్తూ..

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి


సమ్మె కరపత్రం విడుదల చేసిన వివిధ కార్మిక సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తోన్న ఉద్యోగ, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ తదితర కార్మిక సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక హక్కులను కాలరాస్తున్నారని నాయకులు విమర్శించారు. తక్షణమే 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావులు మాట్లాడారు. నాయకులు ఎ.అప్పలరాజు, ఆర్ లింగరాజు, కె.విజయలక్ష్మి, వైఎస్ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సా విద్యార్థి సంఘం ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న గెలుపొందిన విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల (ఇంటర్ క్యాంపస్)లో గత సోమవారం నిర్వహించిన 73వ విద్యార్థి సంఘ ఎన్నికల ఫలితాలను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా డిగల్ మంగళవారం ప్రకటించారు. ప్రెసిడెంట్‌గా ఎం దుర్గా శ్రావణి (సీనియర్ బైపీసీ ఇంగ్లిష్ మీడియం), వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్ సమీర (జూనియర్ బైపీసీ ఇంగ్లిష్ మీడియం) సెక్రటరీగా ఎం విన్నీ (సీనియర్ సీఈసీ ఇంగ్లిష్ మీడియం), జాయింట్ సెక్రటరీగా షేక్ రిజ్వానా (జూనియర్ సీఈసీ ఇంగ్లిష్ మీడియం) ట్రెజరర్‌గా పి.పూజ శ్రీ (సీనియర్ ఎంఎల్‌టీ) డిసిప్లేన్ లీడర్‌గా పి.జాస్మిన్ (సీనియర్ సీఈసీ ఇంగ్లిష్ మీడియం) విజయం సాధించారని పేర్కొన్నారు. వీరితో ప్రమాణస్వీకారం చేయించారు. వీరిని ప్రిన్సిపాల్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ ఫాతిమా డిగల్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందించారు. కార్యక్రమాన్ని గణిత శాస్త్ర విభాగాధిపతి, పి.వరప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్స్ ఐ.ఆండాళ్లు పర్యవేక్షించారు.

ఏరులై పారుతున్న మద్యం

టి.నరసాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బెల్టు షాపులు విచ్చలవిడిగా పెరిగాయని సీపీఎం టి.నరసాపురం మండల కమిటీ నాయకులు గుడెల్లి వెంకట్రావు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోందని పేర్కొన్నారు. టి.నసాపురం పంచాయతీ ప్రకాష్ నగర్‌లో నాలుగు బెల్టు షాపులు ఉన్నాయని, ఈ షాపుల వద్ద మహిళలు సైతం ఆందోళన చేశారని తెలిపారు. తక్షణమే గ్రామంలో బెల్ట్ షాపుల్ని తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

నిస్వార్థ వైద్య తపస్వి బీసీ రాయ్


డాక్టర్లు ప్రసాద్, శార్వాణిలను సన్మానిస్తున్న అమరశ్రీ దంపతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తాను మరణించే రోజు సైతం పేదలకు ఉచితంగా వైద్యం అందించిన నిస్వార్థ వైద్య తపస్వి డాక్టర్ బీసీ రాయ్ అని జిల్లా లయన్స్ నాయకుడు అమరశ్రీ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం నగరంలోని ప్రముఖ జనరల్ సర్జన్లు ఎంఎల్‌వీ ప్రసాద్, ఎం శార్వాణి, కార్డియాలజిస్ట్ ఎ.ప్రసన్న కుమార్, జనరల్ మెడిసిన్ వైద్యుడు స్వరూప్ రెడ్డి, నేత్ర వైద్యుడు పి.విజయ భాస్కర రెడ్డి, యూరాలజిస్ట్ భరద్వాజలను ఘనంగా సన్మానించారు. అమరశ్రీ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీకి ఇచ్చిన మాట ప్రకారం డాక్టర్ రాయ్ పశ్చిమ బెంగాల్ సీఎంగా బాధ్యతలు నిర్వహిస్తూనే పేదలకు నిత్యం వైద్య సేవలందించారని గుర్తుచేశారు. జూలై 1న జన్మించిన రాయ్ 80 ఏళ్ల అనంతరం అదే రోజు మరణించారని తెలిపారు. రాయ్ సేవలను స్ఫూర్తిగా తీసుకుని పేదలకు వైద్య సేవలందించాలని వైద్యులను కోరారు.

సూపర్ 50 తరగతులు ప్రారంభం


కామయ్యకుంట పాఠశాలలో తరగతులను పరిశీలిస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: మండలంలోని కామయ్యకుంట, నూతిరామన్నపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం నుంచి సూపర్ 50 పదో తరగతి ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను డీవైఈఓ ప్రసన్నకుమార్, ఏఎంఓ కె.శిరమయ్యలు పరిశీలించారు. ఆ ప్రత్యేక తరగతుల నిర్వహణ వల్ల 10వ తరగతిలో అధిక మార్కులు సాధించవచ్చన్నారు. గత ఏడాది పాడేరు, సీతం పేటలో ప్రత్యేక తరగతుల వల్ల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో కామయ్యకుంట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, ఎన్ ఆర్‌పాలెం బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక తరగతులు ప్రారంభించామని చెప్పారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	38
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

పచ్చిరొట్ట సాగుతో అదనపు ఆదాయం


పచ్చిరొట్ట పంటకోత ప్రయోగం చేస్తున్న దృశ్యం

చింతలపూడి : పచ్చిరొట్ట సాగుతో పచ్చదనంతో పాటు రైతులకు అదనపు ఆదాయం, భూమికి జీవం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయ మండల డిజిటల్ ఫెసిలిటేటర్ మరికంటి గోపాలకృష్ణ తెలిపారు. చింతలపూడి మండలంల ఎండపల్లిలో రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నవధాన్యాల పచ్చిరొట్ట సాగుపై రైతులకు అవగాహన కలిగించారు. మండలంలో పచ్చిరొట్ట, నవధాన్యాల సాగు విజయవంతంగా జరుగుతున్నట్టు గోపాలకృష్ణ చెప్పారు. 45 రోజుల నవధాన్యాల పంట కోత ప్రయోగాన్ని మంగళవారం నిర్వహించారు. ఎకరాకు 18 కిలోల విత్తనాలు చల్లితే దాదాపు 22 టన్నుల పచ్చిరొట్ట పశుగ్రాసం దిగుబడి వస్తుందన్నారు. ఈ పచ్చిరొట్ట పశువులకు పోషకమైన మేతగానే కాకుండా, భూమికి నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ముఖ్యమైన మూలకాలను అందిస్తుందని వివరించారు. ఎకరా సాగు ద్వారా మొత్తం 60 కిలోల నత్రజని, 10 కిలోల భాస్వరం, 50 కిలోల పొటాష్ భూమిలోకి చేరుతుందని చెప్పారు. రసాయన ఎరువులతో సమానమైన శక్తి భూమికి అందిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఖర్చు తగ్గి లాభాలు పెరుగుతాయని తెలిపారు. రైతులు ఈ విధానం ద్వారా భూములను సారవంతం చేసుకోవచ్చని సూచించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

దెందులూరు: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ హబీబ్ బాషా అన్నారు. మంగళవారం దెందులూరులో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పెరుగ్గూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జాయింట్ డైరెక్టర్ హబీబ్ బాషా మాట్లాడుతూ భూ సాంద్రత ఆధారంగా రైతులు సాగు చేయాలన్నారు.